సాక్షి
నాగర్‌కర్నూల్

శనివారం । 7 । డిసెంబర్ । 2024



జడ్చర్లలో అమృత్ 2.0

అమృత్ 2. 0 ద్వారా చేపట్టిన డిజిటల్ సర్వే జడ్చర్లలో ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



మౌలిక వసతులు కల్పించాలి

పీయూ పరిధిలోని కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వీసీ అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /20.9

వాతావరణం

ఉదయం, సాయంత్రం చల్లని గాలులు బలంగా వీస్తాయి. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

22 నుంచి క్రాస్‌కంట్రీ పోటీలు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాలోని కల్వకుర్తి పట్టణంలో మొట్టమొదటిసారి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ పోటీలను విజయవంతం చేయాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న ప్రారంభం కానున్న అథ్లెటిక్స్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 1,200 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసమే పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీలు పకడ్బందీగా చేపట్టి ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన కోరారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి



కందనూలు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను పరిశోధన, పరిశీలన ప్రయోగాత్మక సామర్థ్యాల ద్వారా ఉపాధ్యాయులు వెలికితీయాలని డీఈఓ రమేష్ అన్నారు. శుక్రవారం ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ భవిష్యత్ నిర్మాణంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించేలా మెరుగైన సూచనలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాలెం వెంకన్నకు వెండి ముడుపులు



బిజినేపల్లి: హైదరాబాద్‌లోని పటాన్‌చెరువుకు చెందిన నల్లేటి యుగేందర్ కుటుంబ సభ్యులు పాలెంలోని అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి శుక్రవారం కిలోన్నర వెండి ఆభరణ ముడుపులు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు నల్లేటి యుగేందర్, సబిత, నల్లేటి నాగరాజు, సుగుణ కుటుంబ సభ్యులు అందించిన ముడుపులను స్వామి వార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామివారి అభిషేకానికి సుగంధ ద్రవ్యాలు, పూజ సామగ్రిని అందజేశారు. నల్లేటి కుటుంబ సభ్యులను ఆలయ అర్చక బృందం సన్మానించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

బాబోయ్.. కుక్కలు




వీధికి ఒకటి, రెండు.. గ్రామాల్లో వదుల సంఖ్యలో.. ఇక పట్టణాల్లో అయితే వందలాది గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నపిల్లలు, ముసలి వాళ్లే కాకుండా జంతువులపై సైతం దాడులు చేస్తూ హడలెత్తిస్తున్నాయి.. చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా కనిపిస్తే చాలు మీదపడి కరిచేస్తున్నాయి. వీటి బారినపడి వందలాది మూగజీవాలు ప్రాణాలు కోల్పోగా.. గత నాలుగేళ్ల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 6,699 మందిపై దాడి చేసి గాయపరిచాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ కుక్కలు కనిపించినా గుండెల్లో రైళ్లు పరుగెడుతున్న పరిస్థితులు దాపురించాయి. నిత్యం ఎక్కడో ఒకచోట కుక్క దాడి ఘటనలు వెలుగు చూస్తున్నా అధికార యంత్రాంగం వాటి కట్టడికి కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సాక్షి ఫోకస్

జిల్లాలో గ్రామసింహాల స్వైరవిహారం

- మనుషులు, మూగజీవులపై ఇష్టారీతిగా దాడులు
- నాలుగేళ్లలో 6 వేలకుపైనే కుక్కకాటు బాధితులు
- జిల్లాకేంద్రంలో నిరుపయోగంగా ఏబీసీ సెంటర్
- నివారణ చర్యలు చేపట్టడంలో అధికారుల మీనమేషాలు

నాలుగేళ్ల వ్యవధిలో బాధితులు ఇలా..



20వ పశుగణన ప్రకారం జిల్లాలో కుక్కలు 14,141

నాగర్‌కర్నూల్: జిల్లావ్యాప్తంగా వీధికుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. మనుషులు, జంతువులు అనే తేడా లేకుండా అడ్డగోలుగా దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులపై దాడికి తెగబడి దారుణంగా కరుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉన్నా జిల్లాకేంద్రంతోపాటు ఆయా మున్సిపాలిటీల్లో పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతుంది. అయితే వీటిని నివారించాల్సిన అధికారులు మాత్రం ఈ విషయంలో మిన్నకుండిపోతున్నారు. కుక్కలు దాడి చేస్తే చికిత్స చేసుకోవడం తప్ప వాటి నుంచి రక్షించుకునే పరిస్థితులు కనిపించడం లేదు.

గతంలో కొన్ని సంఘటనలు...

- నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని ఎండబెట్ల గ్రామంలో ఏప్రిల్ నెలలో పది మంది చిన్నారులపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.
- ఇదే నెలలో నాగర్‌కర్నూల్ మండల పరిధిలో నలుగురు చిన్నారులు, ఒక యువకుడిపై వీధికుక్కలు దాడి చేశాయి.
- నవంబర్ నెలలో మండలంలోని తూడుకుర్తి గ్రామంలో గొర్రెల మందపై దాడిచేసి దాదాపు 10 గొర్రెలను చంపేశాయి.
- అక్టోబర్ నెలలో అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీకి చెందిన నలుగురిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి.
- నవంబర్ 21న తిమ్మాజిపేట మండంలోని బాజీపూర్ గ్రామానికి చెందిన బాలుడు యశ్వంత్‌పై కుక్కలు విచక్షణ రహితంగా దాడి చేయడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

జిల్లాకేంద్రంలో మాత్రమే..



చందాయపల్లి శివారులో ఏర్పాటు చేసిన ఏబీసీ సెంటర్

కుక్కలను నివారించేందుకు మున్సిపాలిటీ పరిధిలో ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని చందాయపల్లి శివారులో ఏర్పాటు చేశారు. అయితే ఈ సెంటర్ ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు ప్రారంభించిన పాపాన పోలేదు. ఇప్పటికే సెంటర్‌కు కావాల్సిన పరికరాలు, కుక్కల ఆపరేషన్‌కు కావాల్సిన మెడిసిన్ కూడా అందుబాటులో ఉంచగా ప్రారంభించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అయితే సెంటర్ ఏర్పాటు ఒక ఎత్తయితే కుక్కలను పట్టేందుకు డాగ్ క్యాచర్‌లకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉండడంతో సెంటర్ ప్రారంభానికి అడుగు ముందుకు పడటం లేదని తెలుస్తోంది. ఒక్కో కుక్కను పట్టేందుకు రూ.1,200 రెమ్యునరేషన్ అడుగుతుండడం, ఇంత ఖర్చు పెట్టే స్థితిలో మున్సిపాలిటీ లేకపోవడంతో సదరు ఏజెన్సీని విరమించుకుని ఇతర ఏజెన్సీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే వీలైనంత త్వరగా ఏబీసీ సెంటర్ తెరిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- జిల్లా పరిధిలోని కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పరిధిలో ఏబీసీ సెంటర్ల ఊసేలేదు. మున్సిపాలిటీల ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండటంతో ఈ సమస్యపై అధికారులు, పాలకవర్గం నోరుమెదపడం లేదు. ఏబీసీ సెంటర్లను ప్రారంభించి మున్సిపాలిటీతోపాటు ఇతర గ్రామాల్లోనూ కుక్కల సంతతిని నియంత్రిస్తే తప్ప ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఏజెన్సీతో మాట్లాడుతున్నాం..

నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని చందాయపల్లి శివారులో ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగింది. అన్ని రకాల పరికరాలు, కావాల్సి మెడిసిన్ కూడా అందుబాటులో ఉంది. కుక్కలను పట్టుకునేందుకు హైదరాబాద్‌లోని ఓ ఏజెన్సీతో సంప్రదింపులు జరుగుతున్నాయి. త్వరలోనే కొలిక్కి తెచ్చి కుక్కలను పట్టుకునేలా చర్యలు తీసుకుంటాం.

– మురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ

అందుబాటులో వ్యాక్సిన్..



కుక్క కాటుకు సంబంధించిన రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్క కాటుకు గురై జనరల్ ఆస్పత్రికి వస్తే వెంటనే చికిత్స అందిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు ఎవరికీ రేబిస్ సోకలేదు.

– డాక్టర్ రఘు, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

అంబేడ్కర్ దార్శనికత మహోన్నతమైనది



అంబేడ్కర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఏ దేశానికి లేని మహోన్నతమైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అంబేడ్కర్ అందించారన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులాలు, మతాలు ఉన్నటువంటి భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని కోరారు. అంబేడ్కర్ భౌతికంగా మన మధ్య లేనప్పటికీ ఆయన ఆశలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక తదితర రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా, సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుపరచడంలో అంబేడ్కర్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైనదని కొనియాడారు. అంబేద్కర్ సూచించిన బోధనలు, ఆలోచనలను మనమందరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, డీపీఓ రామ్మోహన్‌రావు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ చిన్న కిష్టయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సాహానికే సీఎం కప్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

నాగర్‌కర్నూల్: గ్రామ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సీఎం కప్' క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. శుక్రవారం సీఎం కప్ పోటీల సన్నద్ధతపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శని, ఆదివారాల్లో గ్రామ స్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో పోటీల నిర్వహణ ఉంటుందన్నారు. జిల్లా స్థాయి విజేతలకు ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సీఎం కప్‌కి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పోటీల నిర్వహణకు గ్రామ, మండల, జిల్లా కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామ, మండల స్థాయి క్రీడలను తప్పనిసరిగా క్రీడా మైదానాల్లోనే చేపట్టాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని డీపీఓను ఆదేశించారు. క్రీడల నిర్వహణకు పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓలు, వ్యాయామ ఉపాధ్యాయులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాలని డీఈఓకు సూచించారు. జిల్లాస్థాయి పోటీలను నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్‌లో నిర్వహించేలా ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్లతో చేయించాలన్నారు. పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో 36 క్రీడా అంశాల్లో పోటీలు ఉంటాయని డీవైఎస్ఓ సీతారాంనాయక్ చెప్పారు. సమావేశంలో డీఈఓ రమేష్‌కుమార్, డీపీఓ రామ్మోహన్‌రావు, నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నరేష్‌కుమార్, పాఠశాల క్రీడల నిర్వహణ కార్యదర్శి పాండు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్ అమరేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో హోంగార్డుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసు సిబ్బందితో సమానంగా హోంగార్డులు డ్యూటీలు చేస్తున్నారన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో హోంగార్డులను కొన్ని సందర్భాల్లోనే వినియోగించుకుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హోంగార్డుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని, త్వరలోనే వాటిని అమలు చేసే అవకాశం ఉందన్నారు. జిల్లాలో హోంగార్డులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో హోంగార్డుల విధుల్లో ఎలాంటి ఫిర్యాదులు లేవని, రాష్ట్రంలోనే నాగర్‌కర్నూల్ జిల్లాకు హోంగార్డులు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐ కనకయ్యగౌడ్, ఆర్ఎస్ఐలు ప్రశాంత్ కల్యాణ్, శివాజీ, హోంగార్డుల సంఘం అధ్యక్షుడు జమ్ములు, వైస్ ప్రసిడెంట్ రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

సాగని లింక్ కెనాల్

నిలిచిపోయిన సింగోటం- గోపల్‌దిన్నె కెనాల్ పనులు

- ప్రధాన అడ్డంకిగా మారిన భూ సేకరణ సమస్య
- రూ.147.7 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- పూర్తయితే 34 వేల ఎకరాలకు ఉపయోగం
- ఆశగా ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతాంగం



గోపల్‌దిన్నె రిజర్వాయర్ సమీపంలో తవ్విన కాల్వ

కొల్లాపూర్: కొల్లాపూర్ నియోజకవర్గంలోని చివరి ఆయకట్టుకు కూడా సాగునీరందించాలనే ఉద్దేశంతో చేపట్టిన సింగోటం- గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనులు ముందుకు సాగడం లేదు. భూ సేకరణ సమస్య కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ కెనాల్‌పై ఐదు మండలాల రైతులు ఆశలు పెట్టుకున్నారు. కెనాల్ పూర్తయితే సాగునీటి సమస్యలు తీరుతాయని భావిస్తున్నారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కూడా పనుల్లో పురోగతి కనిపించకపోవడంతో రైతులు ఉసూరుమంటున్నారు.

వేలాది ఎకరాలు..

జూరాల ఎడమ కాల్వ పరిధిలో చివరి ఆయకట్టు కింద కొల్లాపూర్ నియోజకవర్గంలో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో రైతులకు రబీ సీజన్‌లో రెగ్యులర్‌గా సాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందు కోసం సింగోటం- గోపల్‌దిన్నె లింకు కెనాల్‌కు శ్రీకారం చుట్టారు. కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా సాగునీటిని మళ్లించే విధంగా ఈ పనులు చేపట్టనున్నారు. ఇందు కోసం గత ప్రభుత్వం రూ.147.7 కోట్లు మంజూరు చేసింది. మూడేళ్ల క్రితం టెండర్లు పూర్తిచేసి, పనులు ప్రారంభించింది. గోపల్‌దిన్నె రిజార్వాయర్‌కు అనుసంధానంగా 5 కి.మీ మేరకు కాలువలను తవ్వారు. తర్వాత భూసేకరణ పేరుతో పనులు ఆగిపోయాయి.

మంత్రి జూపల్లి సమీక్ష..

వనపర్తి జిల్లా పరిధిలో 200 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో వంద ఎకరాలు భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ అసంపూర్తిగానే ఉంది. గత ప్రభుత్వం ఈ పనుల పూర్తికి ప్రయత్నించినప్పటికీ వివిధ రకాల కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్రంలో గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి జూపల్లి కృష్ణారావు కెనాల్ నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కెనాల్ తవ్వకాలకు అవసరమైన భూ సేకరణ అంశాలపై చర్చించారు. పనుల పూర్తికి సత్వరమే చర్యలు చేపట్టాలని సూచించినా.. కదలిక మాత్రం రాలేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం..



లింక్ కెనాల్ తవ్వకాల కోసం అవసరమైన భూ సేకరణకు చర్యలు చేపట్టాం. గ్రామాల వారీగా రైతులతో గతంలో మాట్లాడాం. మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా పనుల పురోగతి గురించి ఆరాతీశారు. ఇప్పటి వరకు జరిగిన పనులు వివరాలను తెలియజేశాం. కెనాల్ పనులకు సంబంధించిన పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

తాగు, సాగునీటి సమస్యలు..

సింగోటం- గోపల్‌దిన్నె లింకు కెనాల్ వల్ల కొల్లాపూర్ నియోజకవర్గంలో ఐదు మండలాల రైతాంగానికి మేలు జరగనుంది. వనపర్తి జిల్లాలోని వీపనగండ్ల, చిన్నంబావి మండలాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందుతుంది. పాన్‌గల్ మండలంలో కొంత మేరకు సాగునీరు అందుతుంది. లింక్ కెనాల్‌కు తూములు ఏర్పాటు చేసి సమీపంలోని చెరువులు, కుంటలకు నీళ్లు మళ్లించేలా డిజైన్లు రూపొందించారు. లింక్ కెనాల్ ద్వారా నీటి సరఫరా ప్రారంభమైతే జూరాల లెఫ్ట్ కెనాల్ కింద ఉన్న 24,500 ఎకరాల ఆయకట్టు, రాజీవ్ భీమా కాల్వ కింద ఉన్న 9,500 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు లభిస్తుంది. అలాగే వేసవిలో గోపల్‌దిన్నె రిజర్వాయర్ కింద ఉండే పలు గ్రామాలకు తాగునీటి సమస్యలు కూడా తీరుతాయి.

ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దాం



ఆర్టీసీ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్ఎమ్ సంతోష్‌కుమార్

నాగర్‌కర్నూల్/ అచ్చంపేట రూరల్: సమష్టి కృషితో ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దామని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం మొదటిసారిగా నాగర్‌కర్నూల్, అచ్చంపేటలోని ఆర్టీసీ డిపోలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా డిపోల్లోని అన్ని విభాగాలను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ డిపో అక్టోబర్ వరకు రూ.8 కోట్ల లాభంలో ఉందని, భవిష్యత్‌లోనూ ఇలాగే పనిచేసి లాభాలను కొనసాగించాలన్నారు. ఫేర్ పెయిడ్ ప్యాసింజర్ల సంఖ్య పెంచాలని, గ్యారేజీ ఉద్యోగులు బస్సులను జాగ్రత్తతో మెయింటెనెన్స్ చేసి ఆన్‌లైన్‌లో ఫెయిల్యూర్ కాకుండా చూడాలని చెప్పారు. విధుల పట్ల అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలిసారి డిపోలను సందర్శించిన ఆర్ఎంను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో డిపో మేనేజర్లు యాదయ్య, ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ బాలసరస్వతి, ఎంఎఫ్ భాస్కర్, సీఐ దేవి, ఏడీసీలు గ్యారేజ్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

కేఎల్ఐ కాల్వల పరిశీలన



భర్కత్‌పల్లిలో కాల్వను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీకాంత్

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లి, చెర్కూర్, పోతేపల్లి, వెల్దండ గ్రామాల్లోని కేఎల్ఐ సాగునీటి కాల్వలను శుక్రవారం డీఈఈ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎల్ఐ కాల్వలో భాగంగా డీ–82 కాల్వ తరుచుగా కోతకు గురై తెగిపోతుందని తెలిపారు. ఈ క్రమంలోనే కాల్వ నాణ్యతను పరిశీలించి ముందస్తుగా మరమ్మతు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాల్వలకు గండ్లు పడటంతో చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించడం కష్టంగా ఉందన్నారు. చివరి ఆయకట్టుకు నాగిళ్ల వరకు రైతులకు సాగునీరు అందించడానికి కృషిచేస్తున్నట్లు వివరించారు. అనంతరం కాల్వలను పరిశీలించి మరమ్మతు పనులపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట డీఈఈ సమ్మయ్య, ఇతర అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

పంప్‌మోడ్ పద్ధతిలో నీటి తరలింపు

దోమలపెంట: శ్రీశైలం భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో సాగర్ జలాశయం నుంచి 4,856 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోకి (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,589, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శుక్రవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 864.1అడుగుల వద్ద 119.1976 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

తాగు నీటికోసం 20 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 390క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా సమాంతర కాలువ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాలువ ద్వారా 800 క్యూసెక్కులు కుడి, ఎడమ కాలువ ద్వారా 45 క్యూసె క్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



చారకొండ: అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శంషోద్దీన్ తెలిపిన వివరాలు.. కల్వకుర్తి నుంచి దేవరకొండకు బొలెరోలో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందింది. చారకొండలో వాహనాన్ని పట్టుకొని స్టేషన్‌కు తరలించి బియ్యాన్ని స్వాధీన పర్చుకున్నారు.ఆర్ఐ రామకృష్ణ పంచనామా నిర్వహించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ రూ.2,739



జడ్చర్ల/నవాబుపేట: బాదేపల్లి మార్కెట్‌లో శుక్రవారం ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ గరిష్టంగా రూ.2,739, కనిష్టంగా రూ.1,866, హంస గరిష్టంగా రూ.2,200, కనిష్టంగా రూ.1,929, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,417, కనిష్టంగా రూ.2,240, వేరుశనగ గరిష్టంగా రూ.6,197, కనిష్టంగా రూ.5,790, జొన్నలు రూ.2061 ధరలు లభించాయి.

■ నవాబుపేట మార్కెట్‌కు ధాన్యం పోటెత్తింది.5,590 బస్తాల ధాన్యం రావడంతో మార్కెట్ నిండిపోయింది. ధాన్యం ఎక్కువగా రావడంతో అదనంగా టెండర్లు వేయాలని రైతులు కోరారు. ఆదివారం కూడా టెండర్లు జరుగుతాయని, ధాన్యాన్ని బట్టి అదనపు టెండర్లు వేసేలా చూస్తామని మార్కెట్ చైర్మన్ లింగం తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



భూత్పూర్: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. వైద్యసిబ్బంది తమవిధులు సక్ర మంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిధిలో ఎంత మందిని డెలివరీ చేశారని, నెలవారీ వివరాలు తెలిపే బోర్డును ఆస్పత్రిలో ఎందుకు పెట్టలేదని వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డెలివరీ వివరాలు కూడా చెప్పకపోవడంపై డీఎంహెచ్‌ఓ మండిపడ్డారు.

వ్యక్తిపై కోతి దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో వ్యక్తిపై కోతి దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తాడూరు మండల కేంద్రానికి చెందిన మద్దిలేటి వ్యక్తిగత పనులపై జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చాడు. అకస్మాత్తుగా అతనిపై కోతి దాడి చేసింది. ఈ ఘటనలో మద్దిలేటికి స్వల్ప గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

జడ్చర్లలో అమృత్ 2.0 సర్వే



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

- డిగ్రీ కళాశాల మైదానంలో డ్రోన్ పాయింట్ సర్వే
- మున్సిపాలిటీలోని ప్రతి ఇల్లు ఇక డిజిటలైజేషన్
- సర్వే అనంతరం డీటీసీపీకి బేసిక్ మ్యాప్ అప్పగింత
- మాస్టర్‌ప్లాన్ అమలుకు కీలకం కానున్న డిజిటల్ సర్వే

జడ్చర్ల టౌన్: అమృత్ 2. 0 ద్వారా మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం సర్వే ఆఫ్ ఇండియా బృందం అర్బన్ టౌన్ ప్లానింగ్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా చేపట్టిన డిజిటల్ సర్వే జడ్చర్ల మున్సిపాలిటీలో ప్రారంభమైంది. పట్టణాల అభివృద్ధి కోసం రాష్ట్రంలోని 20 మున్సిపాలిటీలను అమృత్ 2.0 కింద డిజిటల్ సర్వే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో డిజిటల్ సర్వేకు ఎంపికై ంది జడ్చర్ల ఒక్కటే కావడం విశేషం. సర్వేలో భాగంగా పట్టణ విస్తీర్ణంతోపాటు అటవీ ప్రాంతం, చెరువులు, కుంటలు, నాలాలు, నివాసాలు కుటుంబాల గుర్తింపుతో కూడిన బేస్‌మ్యాప్ సిద్ధం చేయనున్నారు.



డ్రోన్‌తో సర్వే చేస్తున్న సర్వేయర్

డ్రోన్ సహాయంతో..

డ్రోన్ సహాయంతో చేపట్టిన డిజిటల్ సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి శుక్రవారం డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభించారు. సర్వేలో ఏ అంశాలు నమోదు చేస్తారు అనే విషయాలను సర్వే ఆఫ్ ఇండియా సభ్యులు వారికి తెలియజేశారు.

డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా..

మున్సిపాలిటీ 35 స్క్వేర్ కి.మీటర్లు డ్రోన్ సహాయంతో డిజిటల్ సర్వే చేయనున్నారు. పదిరోజులపాటు జరిగే సర్వేను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా ప్రారంభించారు. 5 స్క్వేర్ కి.మీ., మేర ఇక్కడి నుంచి సర్వే చేయనున్నారు. అనంతరం పట్టణంలోని మరో 5 కేంద్రాలను ఎంపిక చేసుకుని అక్కడి నుంచి సర్వే కొనసాగించనున్నారు.

పది రోజులపాటు..



మున్సిపాలిటీకి సంబంధించి బేసిక్‌మ్యాప్ సిద్ధం చేయడంతోపాటు అన్ని వివరాలు డిజిటలైజేషన్ చేయనున్నాం. పదిరోజులు పాటు డ్రోన్ సహాయంతో మున్సిపాలిటీలోని అన్ని వివరాలు నమోదు చేస్తాం. ప్రభుత్వ స్థలాలు, ఇండ్లు, నాలాలు, చెరువులు, కుంటల వివరాలు అన్ని డిజిటలైజ్ చేస్తాం. డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా 5 స్క్వేర్ కి.మీటర్లు సర్వే చేస్తాం. పట్టణంలోని మరో 4 చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసుకుని సర్వే పూర్తిచేస్తాం. – **గోపాల్‌రావు**, సర్వేయర్, సర్వే ఆఫ్ ఇండియా

లెక్కింపు సులభం



సర్వే ఆఫ్ ఇండియా, అర్బన్ టౌన్ ప్లానింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే శుక్రవారం ప్రారంభమైంది. మున్సిపాలిటీ బేస్ మ్యాప్ సిద్ధం చేసి మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ప్రతి ఇంటిని డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి డిజిటలైజేషన్ చేయడం వల్ల పన్నుల లెక్కింపు సులభమవుతుంది. పట్టణ విస్తీర్ణం పెరుగుతుండటంతో సర్వే ద్వారా మౌళిక అవసరాలు గుర్తించవచ్చు.

– **లక్ష్మారెడ్డి**, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

అన్నీ డిజిటలైజేషన్..

డ్రోన్ సహాయంతో మున్సిపాలిటీకి సంబంధించి పూర్తి వివరాలతో బేసిక్ మ్యాప్ సిద్ధం చేస్తారు. వీటిలో మున్సిపాలిటీ విస్తీర్ణం, హద్దులు గుర్తించనున్నారు. అలాగే అటవీ విస్తీర్ణం, ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలు, నివాస గృహాలు, నాలాలు, కాల్వలు, రోడ్లు అన్నింటిని గుర్తించి డిజిటలైజేషన్ చేస్తారు. ప్రతి ఇంటి విస్తీర్ణం లెక్కించి డిజిటలైజేషన్ చేసి రికార్డు అన్నింటిని డీటీసీపీకి పంపిస్తారు. అక్కడి నుంచి తిరిగి మున్సిపాలిటీకి నివేదికలు చేరుతాయి. వాటి ఆధారంగా ఇంటి పన్నుల లెక్కింపు, ప్రభుత్వ స్థలాలను గుర్తించడం చేస్తారు. వీటితోపాటు భవిష్యత్ 20 ఏళ్ల కోసం మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు డిజిటల్ సర్వే ఉపయోగపడుతుంది. అమృత్ 2.0 డిజిటల్ సర్వేలో చేసిన డిజిటలైజేషన్ ఆధారంగా నక్ష పథకం అమలుకు దోహదపడనుంది.

కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



వీసీ శ్రీనివాస్‌తో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వీసీ జీఎస్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఫార్మసీ ఆడిటోరియంలో పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్ల, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని డిగ్రీ, పీజీలో ఫ్యాకల్టీని నియమించుకోవాలన్నారు. విద్యార్థినుల సంరక్షణ కోసం ప్రత్యేక వాష్ రూంలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులతో విద్యార్థులను వేధించడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి రాజుకుమార్, జేడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడుదాం

ఆపదలో ఉన్న వాళ్లకు రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడుదామని వీసీ అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించగా వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రక్తదానం చేయడంపై చాలా మందిలో అపోహలు ఉంటాయని అలాంటివి పెట్టుకోవద్దన్నారు. సామాజిక సేవలో భాగంగా బ్యాంక్ వారు రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో 62 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, బ్యాంక్ క్లస్టర్ హెడ్ అశోక్, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, సీనియర్ మేనేజర్ అశ్విన్, రజనీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడ్స్ రైలు బొగ్గు బోగిలో పొగలు



జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు బోగిలో పొగలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- జడ్చర్ల స్టేషన్‌లో నిలిపివేత
- ఫైరింజన్ సహాయంతో పొగలు ఆర్పిన సిబ్బంది

జడ్చర్ల టౌన్: కాజీపేట నుంచి రాయచూర్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి శుక్రవారం బొగ్గు తీసుకువెళ్తున్న గూడ్స్ రైలు బొగ్గు బోగిలో పొగలు రావడంతో పైలెట్, కో పైలెట్‌లు గుర్తించి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేసి.. ఫైరింజన్ సహాయంతో పొగలు ఆర్పారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కాజీపేట స్టేషన్ నుంచి బొగ్గు లోడ్‌తో గూడ్స్ రైలు రాయచూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో శంషాబాద్ సమీపంలో బొగ్గు క్యాబిన్ నుంచి పొగలు రావడంతో అక్కడ నిలిపివేసి ఫైరింజన్ సహాయంతో ఆర్పేశారు. పొగలు ఆరిపోయాక తిరిగి గూడ్స్ రైలు బయలుదేరింది. అయితే గొల్లపల్లి స్టేషన్ సమీపంలో తిరిగి పొగలు వస్తుండటాన్ని పైలెట్, కోపైలెట్ గమనించి జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేసి.. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది స్టేషన్‌కు చేరుకుని బొగ్గు క్యాబిన్‌లోని పొగలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే బొగ్గు సరఫరాలో ఇలాంటివి సర్వసాధారణమని, బొగ్గు వేడి కారణంగా పొగలు వస్తాయని, వాటిని ఆర్పుతూ ముందుకు వెళ్తామని సిబ్బంది చెప్పారు.

కార్మిక, కర్షక వర్గాన్ని అణచివేసేందుకు కుట్రలు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వేస్లి

అమరచింత: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక వర్గాన్ని అణచివేసేందుకు కుట్రలు చేస్తోందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వేస్లి అన్నారు. మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీపీఎం, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ.. నిరంకుశంగా పరిపాలిస్తుందన్నారు. కార్మిక, కర్షక వర్గానికి సంబంధించిన 29 చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. ఆ లేబర్ కోడ్‌లతో కార్మికులు కనీస వేతనాలు అడిగే హక్కు కూడా లేకుండా పోతుందన్నారు. వ్యవసాయ కూలీల కోసం తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని.. ప్రజల మధ్య మతచిచ్చు పెడుతూ మతోన్మాదాన్ని పెంచుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, జీఎస్ గోపి, రమేష్, వెంకటేష్, అజయ్, బుచ్చన్న, శ్యాంసుందర్, వెంకటేష్, హరికృష్ణ, రేణుకలత, వసంత పాల్గొన్నారు.

నకిలీ మందులు అమ్మితే చర్యలు



అమరచింత: ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ మందులు, ఎరువులను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏడీఏ దామోదర్ హెచ్చరించారు. మండలంలోని అమరచింత, చింతరెడ్డిపల్లె, ఈర్లదిన్నె గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులను అందుబాటులో ఉంచాలని.. లేని పక్షంలో పంటలకు సకాలంలో ఎరువులు అందక దిగుబడి తగ్గి నష్టపోయే పరిస్థితులు ఉంటాయన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను కొనేటప్పుడు పీఓఎస్ యంత్రంలో ఎంట్రీ చేసిన తర్వాతే కొనాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఓ అరవింద్, ఏఈఓ మల్లేష్ ఉన్నారు.

కల్తీ ఆహారం విక్రయాలపై నిఘా

వనపర్తి: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహార విక్రయాలపై నిఘా పెట్టినట్లు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ అన్నారు. శుక్రవారం ఎస్పీ రావుల గిరిధర్ సూచన మేరకు పోలీసు బృందంతో కలిసి జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆహార నిబంధనలు పాటించని సంగీత, ఇతర హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. మరికొన్ని హోటళ్ల యజమానులకు నిబంధనలు పాటించాలని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. కాగా, కొన్ని హోటళ్లలో ఆహారం కొనటమంటే.. డబ్బులిచ్చి అనారోగ్యం కొన్నట్టు ఉందని అందిన ఫిర్యాదులకు స్పందించిన ఎస్పీ.. హోటళ్ల తనిఖీ కోసం ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంట సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



హోటల్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ

నారుమడి యాజమాన్య పద్ధతులు



బిజ్జారం శివారులో యాసంగి కోసం వేసిన నారుమడి

- విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ
- జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

కోస్గి: యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో వరిసాగు చేసే రైతులు వరినారు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. బోరు బావుల కింద వరిసాగు కోసం నారుమళ్లు సిద్ధం చేసేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రైతులు పాటించాల్సిన నారుమడి యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధితో ప్రయోజనాలను జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ వివరించారు.

విత్తన శుద్ధి

నారుపోసే ముందు విత్తన శుద్ధి చేస్తే పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించకుండా నివారించుకోవచ్చు. 1 కిలో విత్తనాలను 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. 1 కిలో విత్తనాలకు 3 గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకుతినే పురుగు, ఉల్లికోడు, ముల్ల పురుగు ఆశించకుండా ఉంటాయి.

అధికారి సలహా



జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

నారుమడి తయారీ

■ నారు పోయాల్సిన మడిని 10-12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి.

■ ఎకరా పొలం నాటడానికి 5 సెంట్లు (500 చదరపు మీ.) నారుమడి అవసరం. సెంటు భూమికి 5 కిలోల విత్తనాలు వాడాలి.

■ 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వాడాలి.

కలుపు నివారణ

■ నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 7లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారి చేయాలి.

నాటు వేసుకునే విధానం

నాటు వేసే నారులో 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంది. నాట్లు వేసేటప్పుడు భూ సారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటర్‌కు 44 దంట్లు(నారు మొలకలు) ఉండేలా నాటుకోవాలి.

■ విత్తిన 15 రోజులకు సైహాలో పాస్ బ్యూటైల్ 10 శాతం మందు 400 మీ.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

■ విత్తిన 10 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 150 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనో క్రోటోఫాస్ 1.6 మీ.లీ మందును లీటర్ నీటిలో కలిపి విత్తిన 10 రోజులకు పిచికారి చేయాలి.

■ జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ పాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి.

చలి ప్రభావం నుంచి రక్షణ..

యాసంగిలో చలి ప్రభావం నుంచి నారు మడుల్లో నారు ఎదగక పోవటం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారడంతోపాటు కొన్నిసార్లు నారుమడి చనిపోవడం జరుగుతుంది. ఇందుకు రైతులు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

■ సాయంత్రం వేళలో నారుమడిలో నీరు తీసేసి పగటిపూట వెచ్చటి నీరు పెట్టాలి. – రోజు సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.

■ జింక్ లోపం వలన ఆకులుపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్ సల్ఫేట్‌ను ఒక లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.

అంబరాన్నంటిన ప్రజాపాలన సంబరాలు



కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారి

వనపర్తి: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో 'ప్రజా ప్రభుత్వం పిలిచింది' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశ పెట్టిన పథకాలపై ప్రముఖ కళాకారుడు అంతడుపుల నాగరాజు బృందం ప్రదర్శనలు ఇచ్చారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తిలకించారు. తెలంగాణ పోరాటయోధుల వీరగాథలు, పోతరాజులు, బతుకమ్మ నృత్యాల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు కలెక్టర్, ఎమ్మెల్యే మెమోంటోలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ సీతారాం, మున్సిపల్ చైర్మన్ పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి



ఖిల్లాఘనపురం: సహజంగా వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం పొందేందుకు తరచూగా పెయిన్ కిల్లర్స్ వాడటం మంచిది కాదని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులు రాజశేఖర్, నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ జయశంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు ఫిజియోథెరపిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరచూగా పెయిన్ కిల్లర్ మందులు వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్ ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ఎక్కువగా సెల్‌ఫోన్ వాడకంతో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఫిజియోథెరపిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం మునావర్ సుల్తానా పాల్గొన్నారు.

ఈ-చలాన్స్‌పై స్పెషల్ డ్రైవ్



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం విస్తృతం వాహనాల తనిఖీలు నిర్వహించారు. కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుల్స్‌కు విధుల శిక్షణలో భాగంగా ట్రాఫిక్ విధులు ఎలా నిర్వహించాలి, వాహనదారులతో ఎలా ప్రవర్తించాలి అనే అంశంపై ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, కార్లపై దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్ కేసులను పరిశీల నలో భాగంగా ఆయా వాహనాలు నిలిపి సదరు వాహనాలపై పెండింగ్ చలాన్స్ పరిశీలించారు.